సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం। 7। జనవరి। 2025



ఉత్సవ శోభ

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 10వ తేదీనుంచి వరున ఉత్సవాలు జరగనున్నాయి. - 8లో



రోడ్ల వెంటే కోళ్ల వ్యర్థాలు

పౌల్ట్రీ యజమానులు నిబంధనలు పాటించడం లేదు. చనిపోయిన కోళ్లను, వ్యర్థాలు రోడ్ల వెంటనే పడేస్తున్నారు. - 9లో



పాండురంగస్వామి కల్యాణం

శ్రీపాండురంగస్వామి భజనమండలి స్వర్ణోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. - 9లో

న్యూస్‌రీల్

ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు

మోత్కూరు: ఫిబ్రవరి మొదటి వారంలో మోత్కూరు పట్టణ కేంద్రంలో రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాలు నిర్వహించనున్నట్లు వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు తెలిపారు. సోమవారం మోత్కూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. సమావేశంలో ఎంఈఓ టి.గోపాల్‌రెడ్డి, సినీగేయ రచయిత అభినయ శ్రీనివాస్, అఖిలపక్ష నాయకులు అభినయ శ్రీనివాస్, వై.దామోదర్‌రెడ్డి, బొల్లు యాదగిరి, పొన్నబోయిన రమేష్, డి.సత్యనారాయణచారి, అవిశెట్టి అవిలుమల్లు, బయ్యని రాజు, డి.అరవిందరాయుడు, ఉప్పలయ్య, సతీష్ చారి, జాని, భాస్కరాచారి పాల్గొన్నారు.

12 రకాల వైద్యసేవలు అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాస్

భువనగిరి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 12 రకాల వైద్య సేవలు అందించాలని అసంక్రమిత వ్యాధుల నివారణ రాష్ట్ర అధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం భువనగిరి పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 పీహెచ్‌సీల సూపర్‌వైజర్లతో సమావేశం అయ్యారు. అసంక్రమిత వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచాలని, వారికి అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిల్పిని, డీపీఓ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

భువనగిరిటౌన్ : జిల్లాలోని వివిధ ప్రాంతాలకు మంగళవారం, బుధవారం రెండు రోజులు నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మిషన్ భగీరథ డీఈ కరుణాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, బీబీనగర్, వలిగొండ మండలాలు, రామన్నపేట మండలంలోని 8 గ్రామాలు, భూదాన్‌పోచంపల్లి మండలంలో 16 గ్రామాలు, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల పరిధిలోని 9 గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేయనున్నారు. అదే విధంగా ఆలేరు నియోజకవర్గంలోని రాజాపేట, ఆత్మకూరు(ఎం), యాదగిరిగుట్ట, ఆలేరు, గుండాల, తుర్కపల్లి, మోటకొండూరు, బొమ్మలరామారం మండలాలు ఉన్నాయి. శామీర్‌పేట నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాలు సరఫరా చేసే పైపులైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు డీఈ వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శివ కేశవులకు సంప్రదాయ పూజలు



శివాలయంలో స్పటికలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొండపై కొలువైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చనతో పాటు ఆలయ మండపంలో స్పటిక లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలోనూ రోజువారీ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకారం మండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణ వేడుక, స్వామి, అమ్మవారి జోడు సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

'రైతుభరోసా'పై బీఆర్‌ఎస్ నిరసన



భువనగిరిలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి : రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి రూ.12వేలకు తగ్గించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు పార్టీ నాయకులు సోమవారం భువనగిరిలో ధర్నా చేశారు. ఎకరాకు రూ.15వేలు ఇవ్వడంతో పాటు భూమిలేని రైతు కూలీలకు సైతం రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల కమిటీ అధ్యక్షు, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, పాండు, గోపాల్, అజీమోద్దీన్, బబ్లూ, బిక్షపతి, యశీల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

యాదాద్రి భువనగిరిలో పురుషుల కన్నా 4,644 మంది ఎక్కువ.. మొత్తం ఓటర్లు 4,60,899

- తుది ఓటరు జాబితా విడుదల
- ముసాయిదాతో చూస్తే స్వల్పంగా పెరుగుదల
- ఉమ్మడి నల్లగొండలో 29,75,286 మంది ఓటర్లు

సాక్షి, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఓటర్ల తుది జాబితాను ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేశారు. మొత్తం 4,60,899 మంది ఓటర్లలో.. పురుషులు 2,28,117, స్త్రీలు 2,32,761, థర్డ్ జెండర్లు 21మంది ఉన్నట్లు తేల్చారు. 2024 నవంబర్ 6నాటి ముసాయిదా జాబితాతో పోలిస్తే ఓటర్లు స్వల్పంగా పెరిగారు. ముసాయిదా జాబితా వెల్లడించిన అనంతరం అభ్యంతరాలు స్వీకరించారు. దీంతో పాటు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకోసం పోలింగ్ బూత్‌ల వారీగా యంత్రాంగం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి విస్తృత ప్రచారం కల్పించింది. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకునేలా చొరవ చూపింది. దరఖాస్తులను బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. బూత్ లెవల్ ఆఫీసర్ నుంచి ఈఆర్‌ఓ వరకు అన్నిస్థాయిల్లో పర్యవేక్షణ జరిపి తుది ఓటరు జాబితా రూపొందించారు. అదే విధంగా భువనగిరి నియోజకవర్గంలో 257, ఆలేరులో 390 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి.

ఆలేరు నియోజకవర్గంలో ఎక్కువగా నమోదు

జిల్లాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు పూర్తి ప్రాతినిధ్యం ఉంది. ఇందులో ఆలేరు నియోజకవర్గంలో అత్యధిక ఓటర్లు నమోదయ్యారు. తుది జాబితా ప్రకారం ఆలేరు నియోజకవర్గంలో 2,38,352 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,18,297, స్త్రీలు 1,19,931, ఇతరులు 20 మంది ఉన్నారు. భువనగిరి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,22,705 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,09,820, మహిళలు 1,12,830, ఇతరులు ఒకరు ఉన్నట్లు ఎన్నికల సంఘం ధ్రువీకరించింది.

ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
భువనగిరి	1,09,820	1,12,830	01	2,22,651
ఆలేరు	1,18,297	1,19,931	20	2,38,248
మునుగోడు	1,29,235	1,30,688	03	2,59,926
నకిరేకల్	1,25,991	1,29,316	04	2,55,311
తుంగతుర్తి	1,29,654	1,31,697	06	2,61,357
దేవరకొండ	1,32,611	1,31,800	19	2,64,430
నాగార్జునసాగర్	1,16,278	1,21,300	19	2,37,597
మిర్యాలగూడ	1,16,222	1,21,313	26	2,37,561
నల్లగొండ	1,22,222	1,29,133	56	2,51,411
సూర్యాపేట	1,19,999	1,26,424	14	2,46,437
కోదాడ	1,20,150	1,27,077	20	2,47,247
హుజూర్‌నగర్	1,22,663	1,30,430	17	2,53,110
మొత్తం	14,63,142	15,11,939	205	29,75,286



ముసాయిదాలోనూ మహిళలే..

జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లోని 566 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం ఓటర్లు 4,60,899 కాగా వీరిలో మహిళలు 2,28,138 మంది ఉన్నారు. పురుషుల కంటే 4,644 మంది ఎక్కువగా ఉన్నట్లు తుది జాబితా ద్వారా తేలింది. ఇందులో భువనగిరి నియోజకవర్గంలో 3,010, ఆలేరు నియోజకవర్గంలో 1,634 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాలో పైచేయిగా ఉన్న మహిళలు తుది జాబితాలోనూ ఎక్కువ మంది నమోదయ్యారు.

పెరిగిన ఓటర్లు 2,473

ముసాయిదా జాబితాను పోల్చుకుని చూస్తే జిల్లాలో 2,473 మంది ఓటర్లు పెరిగారు. గత ఏడాది నవంబర్ 6న ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లాలో 4,58,426 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 4,60,899 మంది ఓటర్లు నమోదయ్యారు.

మార్పులు చేర్పులు

ముసాయిదా జాబితా ప్రకారం భువనగిరి నియోజకవర్గంలో 2,21,589 మంది ఓటర్లు కాగా.. చేర్పులు, మార్పుల అనంతరం 1,587 మంది కొత్త ఓటర్లు చేరారు. 525 ఓట్లను తొలగించారు. ఆలేరులో 2,36,837 మంది ఓటర్లు ఉండగా 444 ఓట్లు తొలగించారు. కొత్తగా 1,855 ఓట్లు నమోదయ్యాయి.

ఓటరు జాబితాల ప్రదర్శన

ఓటర్ల పరిశీలన కోసం తుది ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలు, ఈఆర్‌ఓలు, బూత్ లెవల్ ఆఫీసర్ల వద్ద అందుబాటులో ఉంచారు. ఇదిలా ఉండగా త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను తుది ఓటరు జాబితా ఆధారంగానే నిర్వహించనున్నారు.

జీఓ విడుదల చేయకుంటే సమ్మె బాట



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీలు, స్వీపర్లు

భువనగిరిటౌన్ : పెంచిన కూలి రేట్ల జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయ్ హమాలీలు, స్వీపర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ.. కూలి రేట్లు పెంచుతూ 2024 అక్టోబర్ 10న ఒప్పందం కుదిరినా ఇప్పటి వరకు జీఓ విడుదల చేయకపోవడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. హమాలీల సమ్మె కారణంగా రేషన్ షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు బియ్యం ఎగుమతి నిలిచిపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకు సివిల్ సప్లయ్ కమిషనరే బాధ్యత వహించాలన్నారు. జీఓ విడుదల చేయడంతో పాటు హమాలీల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే పూర్తిస్థాయిలో సమ్మెబాట పడుతామని హెచ్చరించారు. ధర్నాలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొరిగె నర్సింహ, సంఘం నాయకులు ఉట్కూరి నర్సింహ, బత్తుల సత్యా, గౌరవంతుల శ్రీనివాస్, పురుగుల రవి, బోదుల యాదయ్య, ముదిగొండ బస్వయ్య పాల్గొన్నారు.

ప్రజావాణిలో 48 వినతులు

- అర్జీలను స్వీకరించిన అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన వినతులే అధికంగా వచ్చాయి. అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, గంగాధర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 48 మంది అర్జీలు అందజేయగా వాటిని పరిశీలించి ఆయా శాఖలకు పంపించారు. ఇందులో అధికంగా 35 వినతులు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. జిల్లా పంచాయతీరాజ్ 6, హౌసింగ్ 3, మున్సిపాలిటీ, రోడ్లు, భవనాలు ఎక్సైజ్, పరిశ్రమలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- భువనగిరి మండలం వీరవల్లి పంచాయతీ పరిధిలో ఉన్న 30 భారీ వేపచెట్లను ఓ వ్యక్తి అనుమంతి లేకుండా నరికి అమ్ముకున్నాడని గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాలు చేశారు. అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.
- జిల్లా వ్యాప్తంగా బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వెంటనే తొలగించాలని డీవైఎఫ్‌ఐ నాయకులు సలీం, రియాజ్, షాజీద్ వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్‌కాలనీలో పెద్ద సంఖ్యలో బెల్ట్‌షాప్‌లు ఉన్నాయని పేర్కొన్నారు.
- భువనగిరి మండలం తుక్కాపురం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 113లోని శ్మశానవాటికలో ఉన్న సమాధులను ఓ వ్యక్తి జేసీబీతో తొలగిస్తున్నాడని, వెంటనే అడ్డుకోవాలని గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కులస్తులు విన్నవించారు.
- ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలంటూ లబ్ధిదారులు కోరారు. సౌకర్యాలు లేకపోవడం వల్ల అక్కడ నివాసం ఉండలేకపోతున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందనారు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు



దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

భువనగిరిటౌన్ : చైనా మాంజా గాలిపటాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. 'విచ్చలవిడిగా చైనా మాంజా విక్రయం' శీర్షికతో సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి భువనగిరి పట్టణ పోలీసులు స్పందించారు. పట్టణంలోని పలు దుకాణాలు, గాలిపటాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా గాలి పటాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. చైనా మాంజాల వల్ల మనుషులతో పాటు పక్షులకు, పర్యావరణానికి ముప్పు పొంచి ఉందన్నారు. నైలాన్, సింథటిక్ దారానికి గాజు, ప్లాస్టిక్ పొడి పూసి మాంజాను తయారు చేస్తారని, ఇది సాధారణ దారం కంటే గట్టిగా, పదునుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఈ దారం ప్రమాదమని భావించి జాతీయ హరిత ట్రిబ్యునల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. చైనా మాంజాలు విక్రయించకుండా స్పెషల్‌డ్రైవ్ చేపడుతామని, ఎవరైనా విక్రయించినా, వినియోగించినా పోలీస్ స్టేషన్‌కు లేదా, 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో పట్టణ ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, అరుణ్‌కుమార్, సైదులు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి మాధవిలత

భువనగిరి : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తున్న న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి మాధవిలత పేర్కొన్నారు. సోమవారం భువనగిరి మండలం అనంతారం పరిధిలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేని కక్షిదారులు, నిరుపేదలకు ఉచిత న్యాయ సహకారం అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పేదరిక నిర్మూలన, పని కల్పించుట, ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్, రోజ్‌గార్ యోజన పథకం, మహిళలపై లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ అధికారులు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, డీపీఎం, ఏపీఎంలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

భువనగిరిటౌన్ : పట్టణంలోని ఖాజీమోహల్లా చౌరస్తాలో నాలాపై అక్రమంగా నిర్మించిన స్లాబ్‌ను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. నాలాలు, చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించినా, నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన యజమానులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తమ దృష్టికి వస్తే తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

ఆరుట్ల దంపతుల జీవితం స్ఫూర్తిదాయకం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు



ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు

ఆలేరురూరల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధులు ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి దంపతుల జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. ఆలేరులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఆరుట్ల కమలాదేవి, రామచంద్రారెడ్డి స్మారక క్రీడోత్సవాలను సోమవారం ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ ఆరుట్ల సుశీలాదేవితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. దోపిడీ వ్యవస్థను అంతం చేసేందుకు ఆరుట్ల దంపతులు సాయుధ పోరాటాన్ని ఎంచుకుని ఆలేరు ప్రాంతానికి పేరుతెచ్చి పెట్టారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆరుట్ల ఫౌండేషన్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, మమత, శ్రీకాంత్‌రెడ్డి, ఐజీ సీఎం రమేష్(ఐపీఎస్), సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ గౌడ్, పీఈటీలు మధుసూదన్, పూల నాగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సీపీఐ నాయకుల ధన్యవాదాలు



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీఐ నేతలు, చిత్రంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

నల్లగొండ టౌన్ : డిండి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి రూ.1800 కోట్లు కేటాయించిన నేపథ్యంలో సోమవారం సీపీఐ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఫ్లోరైడ్‌తో మగ్గిపోతున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగు నీరు అందించే డిండి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే యాదగిరిరావు ఉన్నారు. వారి వెంట నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ఉన్నారు.

ఇంటర్ @ 90 డేస్

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ

- రోజూ ఉదయం, సాయంత్రం వేళలో స్టడీ అవర్స్
- రోజుకో సబ్జెక్ట్ లెక్చరర్ పర్యవేక్షణ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- ఒత్తిడికి లోనుకాకుండా కౌన్సెలింగ్
- తల్లిదండ్రులతోనూ సమావేశాల నిర్వహణ
- ప్రతి నెలా విద్యాశాఖకు నివేదిక



రామన్నపేట : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనపై ఆ శాఖ దృష్టి సారించింది.రాష్ట్రస్థాయిలో ర్యాంకు మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.ఇందుకోసం ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తోంది. ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకుని పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఒత్తిడికి లోనయ్యే విద్యార్థులకు నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ప్రతి నెలా విద్యాశాఖకు నివేదిక అందజేయనున్నారు.

ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్

వార్షిక పరీక్షలకు మూడు నెలలు మాత్రమే సమయం ఉండడంతో అధ్యాపకులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళ్లలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రోజుకో సబ్జెక్ట్ లెక్చరర్ పర్యవేక్షణలో స్టడీ అవర్స్ కొనసాగుతున్నాయి. సిలబస్ రివిజన్, ముఖ్యమైన ప్రశ్నలు ఇచ్చి చదివించడం, స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. అకడమిక్ ప్లాన్ ప్రకారం యూనిట్ టెస్టులు, అర్ధవార్షిక పరీక్షలు కూడా నిర్వహించారు. అంతేకాకుండా తల్లిదండ్రులతోనూ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రతి విద్యార్థి ప్రగతి, నడవడికను సమీక్షిస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఇంటర్ ఫలితాల్లో జిల్లా ర్యాంకు ఏటేటా పడిపోతోంది. 2023 -24 విద్యా సంవత్సరంలో ఫస్టియర్ రాష్ట్ర స్థాయిలో 26, సెకండియర్ 25వ స్థానంలో నిలిచింది. 2022 -23లో ప్రథమ సంవత్సరం 19వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 22వ స్థానంలో నిలిచాం. ఉత్తీర్ణత మెరుగుపడకపోగా ఏటేటా తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం వంద శాతం ఫలితాలు సాధించేలా 90 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు, రోజూ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా బోర్డు అధికారులు, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో జూనియర్ కాలేజీలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 11, జనరల్ గురుకులాలు 2, వివిధ యాజమాన్యాలకు చెందిన గురుకులాలు, మోడల్ కళాశాలలు 28, ప్రైవేట్ జూనియార్ కళాశాలలు 24 ఉన్నాయి. వీటిలో మొత్తం 14,325మంది విద్యార్థులు విద్యభ్యసిస్తున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సులు 4,905, ఒకేషనల్ కోర్సుల్లో 1,882 మంది విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ కోర్సులు 5,549, ఒకేషనల్ కోర్సులను 1,989 మంది అభ్యసిస్తున్నారు.

ప్రత్యేక తరగతులతో ఉపయోగం



ఉత్తమ ఫలితాల సాధనకు 90 రోజుల ప్రణాళిక రూపొందించారు. రోజూ స్లిప్ టెస్టులు పెడుతున్నారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారితో ముఖ్యమైన ప్రశ్నలు చదివిస్తున్నారు. అధ్యాపకుల సూచనలతో ఫస్టియర్‌లో మంచి మార్కులు వచ్చాయి. సెకండియర్‌లో కూడా మంచి మార్కులు సాధిస్తాను.

– ఎ.ప్రవళిక, ద్వితీయ సంవత్సరం, ఎంపీసీ, రామన్నపేట

క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాపై అధికారుల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద అక్రమంగా డంప్ చేసిన ఇసుక గురించి రెవెన్యూ అధికారులు, పోలీసులు ఆరా తీశారు. వంతెన నిర్మిస్తున్న కాంట్రాక్టర్ అక్రమంగా రవాణా డంప్ చేశాడా అనే విషయంపై అధికారులు ఆధారాలు సేకరిస్తున్నారు. అనంతరం ఎస్ఐ రవికుమార్ ట్రాక్టర్ల యజమానులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఆన్‌లైన్ బుకింగ్ ఉంటేనే ఇసుక రవాణా చేయాలని, అక్రమంగా ఒక ట్రిప్పు ఇసుక కూడా రవాణా చేయొద్దని ఆదేశించారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం


జోగునూరు మానస

త్రిపురారం: నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందిందని నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మడం గ్రామానికి చెందిన జోగునూరి మానస(22) నాలుగేళ్ల క్రితం నరేష్ అనే యువకుడిని ప్రేమ వివాహం చేసుకుంది. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మానస కనబడటంలేదు. ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మానస ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుండడంతో ఆమె తల్లి పోతుగంటి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మానస ఎరుపు రంగు పంజాబీ డ్రెస్సు, తెలుపు రంగు ప్యాంట్ ధరించిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత


పట్టుబడిన వాహనాల్లోని పశువులు

గరిడేపల్లి: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను గరిడేపల్లి మండల కేంద్రం శివారులో పొనుగోడు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఎస్ఐ చలిగంటి నరేష్ పట్టుకున్నారు. సూర్యాపేట నుంచి గరిడేపల్లికి ఎలాంటి పత్రాలు లేకుండా 31 ఎద్దులు, 10 దున్నపోతులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ పశువులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా గురజాల సంతకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ డిక్కీలోని నగదు చోరీ

తిరుమలగిరి: బైక్ డిక్కీలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నగదు చోరీ చేశారు. ఈ ఘటన తిరుమలగిరి ఎక్స్ రోడ్‌లో సోమవారం జరిగింది. తిరుమలగిరి మండలం ఫణిగిరి గ్రామానికి చెందిన తాటిపల్లి శ్రీను రూ.1.83లక్షల నగదును తన బైక్ డిక్కీలో పెట్టుకుని తిరుమలగిరి ఎక్స్ రోడ్‌లోని జిరాక్స్ సెంటర్ ఆగాడు. బైక్‌ను జిరాక్స్ సెంటర్ ముందు పార్కింగ్ చేసి లోపలికి వెళ్లి వచ్చేసరికి డిక్కీలోని నగదు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటన జరిగిన ప్రదేశాన్ని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి సందర్శించారు.

యాదగిరి క్షేత్రానికి ఉత్సవ శోభ

వరుస ఉత్సవాలకు సిద్ధమవుతున్న దేవస్థానం
- 10న వైకుంఠ ఏకాదశి.. అధ్యయన వేడుకలు ప్రారంభం
- ఫిబ్రవరిలో 7 నుంచి పాతగుట్ట బ్రహ్మోత్సవాలు
- 23న స్వర్ణ విమాన గోపురానికి కుంభాభిషేకం
- మార్చి 1 నుంచి యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు


యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరుస ఉత్సవాలకు సిద్ధమవుతోంది. వీటితో యాదగిరి క్షేత్రం ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. యాదగిరీశుడి ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, కొండపైన గల శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రాల్లో ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి, అధ్యయనోత్సవాలతో మొదలై మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

10న అధ్యయనోత్సవాలు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశిని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు పనుల్లో, అర్చకులు పూజాది కైంకర్యాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శ్రీస్వామి వారు 10న సూర్యోదయానికి ముందే ఉత్తరద్వారం గుండా భక్తులకు వైకుంఠ నాథుడిగా దర్శనమివ్వనున్నారు. ఆ రోజు ఉదయం 4.15గంటల నుంచి 5.15గంటల వరకు శ్రీస్వామి వారి అలంకార సేవను ఊరేగిస్తారు. ఉదయం 5.30గంటల నుంచి 6.30గంటల వరకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పిస్తారు. అదేరోజు శ్రీస్వామి వారికి 5 రోజుల పాటు జరిగే అధ్యనోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుడతారు. ఉదయం 8గంటల నుంచి 9.30గంటల వరకు అధ్యయనోత్సవ పురవీధి సేవను ఊరేగిస్తారు. 15న అధ్యయనోత్సవాలు పరిసమాప్తి కానున్నాయి. 5 రోజుల పాటు ఆలయంలో జరిగే అధ్యయనోత్సవాల్లో శ్రీస్వామి వారు వివిధ అలంకారాల్లో ఉదయం, సాయంత్రం భక్తులకు దర్శనమిస్తారు. ఇవే కాకుండా ధనుర్మాసంలో భాగంగా 13న గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు.

వచ్చే నెల 7న పూర్వగిరీశుడికి..

యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు మూడ్రోజుల పాటు అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. 7న పూర్వగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. 7న స్వస్తీ వాచనం, అంకురారోపణం, 8న దేవతాహ్వానం, ధ్వజారోహణం, 9న ఎదుర్కోలు ఉత్సవం, 10వ తేదీన శ్రీలక్ష్మీ నృసింహస్వామి తిరుకల్యాణోత్సవం, 11న శ్రీస్వామి వారి రథోత్సవం, 12న పూర్ణాహుతి, చక్రతీర్థం, 13న శతఘటాభిషేకంతో ఉత్సవాలు పూర్తవుతాయి.

శివోత్సవాలు.. ఫిబ్రవరి 23 నుంచి

శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను ఆరు రోజుల పాటు నిర్వహించనున్నారు. 23న స్వస్తీ వాచనం, అంకురారోపణం, 24న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 25న శ్రీశివ కల్యాణోత్సవం, 26న మహా శివరాత్రి, అభిషేకాలు, శత రుద్రాభిషేకాలు, 27న లక్ష బిల్వార్చన, రథోత్సవం, 28న పూర్ణాహుతి, త్రిశూల తీర్థం వంటి పూజలను జరిపిస్తారు. ఇదే నెలలో శ్రీస్వామి దివ్యవిమాన స్వర్ణ గోపురానికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. 60 కిలోల బంగారంతో విమాన గోపురం స్వర్ణమయం కానుంది. ఫిబ్రవరి రెండవ వారం వరకు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా స్వర్ణ విమాన గోపురానికి మహా కుంభాభిషేకం పూజలు జరిపించనున్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1 నుంచి..

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీన ప్రారంభమై 11వ తేదీన ముగుస్తాయి. 1న స్వస్తీ వాచనం, 2న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 3 నుంచి 6 వరకు వేద పారాయణములు, హవనములు, అలంకార సేవలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయి. 7న శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం, 8న తిరు కల్యాణోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం, 10న పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపు ఉత్సవం, 11వ తేదీన శతఘటాభిషేకం, డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్ల పరిశీలన


ఉత్తర మాడ వీధిలో ఏర్పాట్ల గురించి చర్చిస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 10వ తేదీన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో వైకుంఠ ద్వార దర్శనానికి అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఉత్తరం మాడ వీధిలో స్వామివారిని అధిష్ఠింపజేసేందుకు వేదిక స్థలాన్ని, వీఐపీల కోసం ఏర్పాటు చేసే గ్యాలరీలను ఈఓ సోమవారం సివిల్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఉత్తర మాడ వీధిలో స్వామి వారిని అధిష్ఠింపజేయడానికి 16 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల పొడవుతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే వీఐపీలకు రెండు గ్యాలరీలు, మీడియాకు ఒకటి, భక్తుల కోసం మరో 5 గ్యాలరీలను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా పారాయణీకులు, అర్చకులకు ప్రత్యేక వేదికను సైతం ఏర్పాటు చేస్తారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సైతం రూ.150 టిక్కెట్ క్యూలైన్ నుంచి మరో ప్రత్యేక క్యూలైన్‌ను అధికారులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జాతీయ కార్యక్రమాల నిర్వహణలో ముందుంటాం

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్


మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్

రామగిరి(నల్లగొండ): జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ముందుంటుందని వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. యూనివర్సిటీ తెలుగు శాఖ, జాతీయ పరీక్ష కేంద్రం, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజెస్-మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగులో పరీక్ష, మూల్యాంకనం మరియు ప్రశ్నాంశ రచన పద్ధతి' అంశంపై ఉమ్మడి జిల్లా కళాశాలలు, ఉన్నత పాఠశాలల తెలుగు అధ్యాపకులకు ఏర్పాటు చేసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం వైస్ చాన్స్‌లర్ ప్రారంభించి మాట్లాడారు. బోధన, ప్రశ్నావళి రూపకల్పన, మూల్యాంకనం ఉన్నత విద్యలో అత్యంత కీలకమన్నారు. విద్యార్థుల అభ్యసన సరళిని అధ్యాపకులు అనునిత్యం పరిశీలించాలన్నారు. అనంతరం ముఖ్య వక్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఉమామహేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇంటి భాష, తరగతుల భాష మధ్య అంతరాలు తొలగినప్పుడే భాషోదయం కలుగుతుందని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు ప్రతి వైజ్ఞానిక ఆవిష్కరణను వెంటనే తమ మాతృభాషలో అనువదించే మహోన్నత ప్రక్రియ ద్వారా పేటెంట్లు, నోబెల్ బహుమతులు సాధించగలుగుతున్నాయన్నారు. భారతదేశంలో ప్రతి లక్ష మంది జనాభాకు కేవలం రెండు పేటెంట్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. తద్వారా భాష వల్ల సమకూరే సంపద సృష్టి మనం చేజార్చుకుంటున్నామని చెప్పారు. మాతృ భాష పట్ల గౌరవంతో పాటు అంతర్జాలంలో సైతం మాతృభాష వినియోగం వల్ల అభ్యసనం సులభతరం అవుతుందన్నారు. భాష అనే సాధనం ద్వారా సమాజ హితమైన ఆవిష్కరణలకు ఆస్కారం కలుగుతుందన్నారు. అనంతరం బోళ్ల నారాయణరెడ్డి పరీక్ష మూల్యాంకనం, జాతీయ విద్యావిధానం -2020పై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు భుజంగరెడ్డి, తెలుగు సాహిత్యం బోధన పద్ధతులపై డాక్టర్ వెల్దండి శ్రీధర్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ అండ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కె. అరుణప్రియ, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, అనితకుమారి, జి. నరసింహ, డాక్టర్ కృష్ణ కొండిన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

చింతపల్లి: ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం దేవ్వులతండా శివారులో జరిగింది. స్థానిక ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల గ్రామానికి చెందిన వూరె శివ ఆటోలో అతడితో పాటు అదే గ్రామానికి చెందిన బైకాని నరసింహ, బైకాని శివ కలిసి చింతపల్లి మండలం దేవ్వులతండా నుంచి మాల్ వైపు వెళ్తుండగా.. గ్రామ శివారులో మూలమలుపు వద్ద హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వూరె శివ, బైకాని నరసింహ, బైకాని శివకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మాల్ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ వూరె శివ బాబాయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కలదేవిగూడెం గ్రామానికి చెందిన మండవ యల్లయ్య గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో యూరియా చల్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ శివారులో ఖమ్మం నుంచి సూర్యాపేటకు వస్తున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యల్ల య్య కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాతుడిని స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

శాసనమండలి చైర్మన్ ఇంటి సమీపంలో కలకలం

- చికెన్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో పేలిన సిలిండర్


కాలిబూడిదైన చికెన్ సెంటర్

చిట్యాల: చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇంటి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కలకలం చోటుచేసుకుంది. ఆయన ఇంటి సమీపంలో నిర్వహిస్తున్న చికెన్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు అందులోని సిలిండర్‌కు అంటుకోవడంతో అది కాస్త పేలి డబ్బా మొత్తం కాలిబూడిదైంది. ఇది గమనించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇంటి వద్ద ఉండే భద్రతా సిబ్బంది వెంటనే చికెన్ సెంటర్ యజమానికి సమాచారం అందించారు. ఆ సమయంలో సుఖేందర్‌రెడ్డి ఇంట్లో లేరు. చికెన్ సెంటర్‌లో సిలిండర్ పేలడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

దాడి ఘటనపై విచారణ


బ్రాహ్మణగూడెం గ్రామంలో విచారణ జరుపుతున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక

గుర్రంపోడు: మండలంలోని జూనూతుల గ్రామానికి చెందిన మారపాక సుధాకర్‌పై ఈ నెల 3వ తేదీన బ్రాహ్మణగూడెం గ్రామంలో అదే గ్రామానికి చెందిన బెల్లి వెంకన్న, పగడాల సైదులు మరికొందరు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఈ ఘటనపై సోమవారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక విచారణ జరిపారు. బాధితుడితో పాటు సాక్ష్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఏఎస్పీ వెంట కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్, గుర్రంపోడు ఎస్ఐ పసుపులేటి మధు ఉన్నారు.

గుండెపోటుతో యువతి మృతి


సాత్విక (ఫైల్)

హుజూర్‌నగర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. హుజూర్‌నగర్ పట్టణంలోని 10వ వార్డుకు చెందిన చీకాకోళ్ల శ్రీనివాసచారి కుమార్తె సాత్విక(19) హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటున్న ఆమెకు తీవ్ర జ్వరం రావడంతో శనివారం ఇంటికి వచ్చి స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. అయినప్పటికీ ఆమె కోలుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాత్వికకు సోమవారం షుగర్ స్థాయి పెరిగి గుండెపోటు రావడంతో మృతి చెందింది. సాత్విక మృతి పట్ల కౌన్సిలర్లు గుండా ఫణికుమారిరాంరెడ్డి, జక్కుల నాగేశ్వరరావు, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, బి.చంద్రం, డి. బ్రహ్మం తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సంక్రాంతికి ఊరెళ్లే వారికి పోలీసుల సూచనలు

నల్లగొండ: సంక్రాంతి సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారికి నల్లగొండ టూటౌన్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఊరికి వెళ్లే సమయంలో విలువైన వస్తువులని వెంట తీసుకెళ్లాలని, డబ్బులు, బంగారం బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఊరికి వెళ్లే వారు పక్కన ఇంటి వారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి చుట్టూ లైట్లు వేసి ఉంచాలని, ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని, రద్దీగా ప్రదేశాల్లో, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఉన్నప్పుడు లగేజ్ బ్యాగ్‌లతో పాటు సెల్‌ఫోన్లు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు.

అవకతవకలపై కేసు నమోదు చేయండి

- జాజిరెడ్డిగూడెం ఏపీఎంను ఆదేశించిన సూర్యాపేట కలెక్టర్

భానుపురి (సూర్యాపేట): జాజిరెడ్డిగూడెం మండలంలోని బొల్లంపల్లి గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సంబంధిత ఏపీఎంను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నిర్వహణ మార్గదర్శకాలకు విరుద్ధంగా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రికార్డులు సరిగ్గా నిర్వహించకుండా అవకతవకలకు పాల్పడినందున కొనుగోలు కమిటీ సభ్యులైన కె. జయమ్మ, మైబు, టి. వాసవి, ఏ. చంద్రకళ, కె. అలివేలు, సీహెచ్ పద్మతో పాటు సెంటర్ ఇన్‌చార్జి(వీఓఏ)పై క్రిమినల్ కేసు పెట్టాలని జాజిరెడ్డిగూడెం ఏపీఎంను కలెక్టర్ ఆదేశించారు.

పెంచిన రేట్ల జీఓ విడుదల చేయాలని ధర్నా

నల్లగొండ టౌన్: సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులకు పెరిగిన రేట్ల జీఓను విడుదల చేసి అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అధికారులు జీఓను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దొనకొండ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భద్రయ్య, ఆంజనేయులు, నాగరాజు, వెంకటయ్య, లింగయ్య, లింగస్వామి, జానయ్య, మహేష్, నాగయ్య, శ్రీను, కృష్ణయ్య, రఘు, చంటి, సత్యం, లక్ష్మయ్య, అశోక్, అంజి, లింగం పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

చెస్ పోటీలో ఏడేళ్ల చిన్నారి ప్రతిభ


చెస్ పోటీని పరిశీలిస్తున్న అంతర్జాతీయ చెస్ క్రీడాకారుడు అరవింద్

మిర్యాలగూడ అర్బన్: చెస్ పోటీలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఏడేళ్ల చిన్నారి బ్రిందశ్రీ ప్రతిభ చూపింది. మిర్యాలగూడ పట్టణంలోని ఐఎంఏ భవనంలో సోమవారం నోబెల్ వరల్డ్ సంస్థ అనుమతితో అంతర్జాతీ చెస్ క్రీడాకారుడు అరవింద్ న్యాయ నిర్ణేతగా రెండు నిమిషాల టార్గెట్ 50 పజిల్స్‌లో చెక్‌మెట్ చెస్ పోటీ నిర్వహించారు. ఇందులో చిన్నారి బ్రిందశ్రీ పాల్గొని కేవలం నిమిషం 49 సెకండ్ల వ్యవధిలో 50 పజిల్స్‌లో చెక్‌మెట్ పెట్టి సత్తా చాటింది. ఈ పోటీని వీడియో రికార్డు చేసి మెయిల్ ద్వారా నోబెల్ వరల్డ్ సంస్థకు పంపించామని ఇంటర్ నేషనల్ చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ తెలిపారు. బ్రిందశ్రీకి ప్రతిభను గుర్తించిన స్థానిక ఐఎంఏ ప్రతినిధులు ఆమెకు సర్టిఫికెట్ అందజేశారు. చిన్నారిని ఐఎంఏ అధ్యక్షుడు సతీష్‌కుమార్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మాశెట్టి శ్రీనివాస్, కర్నాటి రమేష్, వనిత, గీత, సైదులు అభినందించారు.

గిరిజన చట్టాలపై అవగాహనే లక్ష్యం

- ఆదివాసీ కాంగ్రెస్ నేషనల్ చైర్మన్ మోగె శివాజీరావు



మాట్లాడుతున్న శివాజీరావు

నాగార్జునసాగర్: గిరిజన చట్టాలపై గ్రామస్థాయి నుంచి పూర్తి అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో దేశంలోని 15 రాష్ట్రాల్లో గిరిజనులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఆదివాసీ కాంగ్రెస్ నేషనల్ చైర్మన్ మోగె శివాజీరావు అన్నారు. తెలంగాణలో మొదటిసారిగా నాగార్జునసాగర్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సాగర్‌లో జరుగుతున్న శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే రాహుల్ గాంధీ ఆశయమన్నారు. ఆరు నెలల కాలంలో 29 రాష్ట్రాల్లో గిరిజన, ఆదివాసీ కాంగ్రెస్ ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 5వేల మందికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన చట్టాలు, హక్కులు, అటవీ, రెవెన్యూ చట్టాలు, రాజ్యాంగంలో ఆదివాసీల కోసం అమలవుతున్న ఆర్టికల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, పలు రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

'పెద్దగట్టు' భక్తులతో ఇబ్బందుల్లేకుండా చూడాలి


ఈఓకు వినతి పత్రం అందజేస్తున్న పూజారులు

చివ్వెంల: రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు జరగనున్నందున భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఆలయంలో తమకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పెద్దగట్టు పూజారులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఆలయ ఈఓ కుశలయ్యకు వినతిపత్రం అందజేశారు. జాతర ప్రారంభానికి ముందుగా ఫిబ్రవరి 2న జరిగే దిష్టిపూజకు కూడా తగిన భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూజారులు గోర్ల గన్నారెడ్డి, మెంతబోయిన బచ్చయ్య, మెంతబోయిన లింగస్వామి, గిర్ల అప్పిరెడ్డి, మెంతబోయిన చిన్న మల్లయ్య, గుర్వయ్య, లింగయ్య, కృష్ణయ్య, నాగయ్య, శీనయ్య, అశోక్, రమేష్, రంగయ్య, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో బాలికలకు రక్షణ కరువు

- రాత్రివేళ వసతి గృహం గోడ దూకుతున్న ఆకతాయిలు
- విధి నిర్వహణలో వార్డెన్, ఏఎన్ఎం అలసత్వం

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గల బాలికల హాస్టల్‌లో రాత్రివేళ ఆకతాయిలు గోడలు దూకుతూ భయాందోళనకు గురిచేస్తున్నారు. రాత్రిపూట విద్యార్థినులకు అండగా ఉండాల్సిన వార్డెన్, ఏఎన్ఎం విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో పాటు నైట్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ వ్యక్తి కూడా పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు పెచ్చుమీరుతున్నారు. సుమారు వంద మంది బాలికలు హాస్టల్‌లో ఉంటుండగా.. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో ఆకతాయిలు ఇష్టానుసారంగా హాస్టల్‌లోకి చొరబడుతున్నారని బాలికల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లోకి బయటి వ్యక్తులు ఎప్పుడు పడితే అప్పుడు వచ్చిపోతుండడంతో తమ పిల్లలకు రక్షణ లేదనే భావనతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్ నుంచి తీసుకుపోవడానికి సిద్ధమవుతున్నారు. కొందరు యువకులు హాస్టల్‌లోకి చొరబడ్డ విషయమై ఉపాధ్యాయులకు తెలియడంతో ఇటీవల పలువురు విద్యార్థినులను, యువకులను మందలించినట్లు తెలిసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విధుల్లో అలసత్వం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ ధారాసింగ్‌ను వివరణ కోరగా బాలికల హాస్టల్ కేజీబీవీ ఎస్ఓ ఆధీనంలో ఉందని, ప్రస్తుతం వారు సమ్మెలో ఉన్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన విషయం తన దృష్టికి రాలేదని అన్నారు.

కోనేరులో పడి బాలుడు మృతి

కోదాడ రూరల్: ఆడుకుంటూ వెళ్లి కోనేరులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం గుడిబండ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చార్మినార్‌కి చెందిన ఎండీ అఫ్రీన్, ఆమె కుమారుడు సాద్(5)తో కలిసి గుడిబండలో జరుగుతున్న ఉర్సుకు సోమవారం వచ్చారు. అఫ్రీన్ మసీదు వైపు వెళ్లగా సాద్ అక్కడ పిల్లలతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతిచెందాడు. అఫ్రిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు.

ఇద్దరి రిమాండ్

చందంపేట: బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి వద్ద ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకుని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిలో శ్రీను, తిరుపతిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.